ఈవారం

# కథ

ఇది లేదూ అనుకుంటే ఏ ఇబ్బందీ లేదు. వుండీ పొందలేకుంటేనే గుండె పిండేసినట్టుం టుంది.

పక్కల్లో పేగు తెంచుకున్న పసికందుంది.

గుండె నిండా తల్లి ప్రేమ తొణికిసలాడుతూ వుంది.

కనుచూపు మేరా పరుచుకున్న బిడ్డ భవిష్యత్‌కు, సంబంధించిన బంగారు కల వుంది.

ఇన్నిటి మధ్యా - "దాన్ని వదిలించుకోకుంటే, నిన్ను నేను వొదిలించుకుంటాను" అంటూ భర్త ప్రతినిత్యం చేస్తున్న హెచ్చరిక కళ్ళ ముందు ఉరి తాడులా కదలాడుతూ వుంది.

## ఓసినిప్పు

— లో.పు.

పసికందును రొమ్ము కానించుకుని పాలు తాగుతూ వుంది జయమ్మ. జయమ్మ కళ్ళ లోంచి రాలుతున్న కన్నీటి బొట్లు బిడ్డ నోట్లోకి జారిపోతూ వున్నాయి. బిడ్డ పాలే తాగుతుందో, కన్నీళ్లే తాగుతోందో గమనించే స్థితిలో లేదు జయమ్మ.

తల్లి విషం తాపినా, నమ్మకంగా తాగేసే పసి కందు - పాలనూ, కన్నీళ్లనూ కలిపి జుర్రేస్తూ వుంది.

బిడ్డ కళ్ళలోకి, కళ్ళెట్టి చూసింది జయమ్మ. మృత్యువునైనా వదరకుండా ఆహ్వానించగలిగే పసి తనం. నమ్మకం - చెక్కుచెదరకుండా వుండగలిగేది ఒక్క పసితనంలోనే కదా! నమ్మకమే కదా పసితనా నికి మనం ఇవ్వగలిగే నిఖార్సయిన బహుమానం. ఆర్థికం కులం మనిషి బతుకును నిర్ణయించి, నిర్దే శించి, నడిపిస్తున్నచోట అమాయకత్వానికి మించిన తెగింపు లేదు. తెలియనితనానికి మించిన వీరత్వం లేదు.

అచ్చం తన ముక్కు, తన కళ్ళు, తన నోరు... తన బతుకు... ఆడబతుకు - వొడిలోని బిడ్డను ప్రేమగా నిమిరింది జయమ్మ. బిడ్డ కల్లాకపటం లేని బోసినవ్వును బహుమానంగా ఇచ్చింది.

ఆడదాన్ని 'ఇలా బతుకు' అని శాసించే స్థితిలో జయమ్మ తండ్రి తరముంటే, 'ఒసేయ్ ఆడదానా - నీకు నా సరసన బతుకేలేదు' అని నిర్ణయించే స్థితికి చేరుకుంది జయమ్మ భర్త తరం. తన తండ్రి, భర్త తరాల మధ్య సమాజం తెచ్చిన మార్పు. తన భర్త నోట్లోంచి తీర్పై బైటపడింది. మనిషి - మనిషికీ మధ్య అంతరాలను సృష్టించి, ఆ అంతరాలను నానాటికీ మరింత పెంపొందించితే తప్ప - తాను ప్రాణం నిలుపుకోలేని వ్యవస్థ మనది.

ఊరుకూ - వాడకూ మధ్య అంతరం. ఆడకూ - మగకూ మధ్య అంతరం. అంతరమే ఈ వ్యవస్థ ఆయువుపట్టు.

జయమ్మ - వెంకటయ్యలది ప్రేమ వివాహం. ప్రేమకు అర్థం వెతుక్కునేలోపే పెళ్ళి-పెటాకులై పోయింది. జయమ్మ-వెంకటయ్యలది కులాంతర వివాహం. కళ్ళు మూసి తెరిచే లోపే కులం తన కుత్తుక మీద వర్తిస్తున్నదిప్పుడు.

తాము ఎలా ప్రేమించుకున్నామో? ఏం చూసి ప్రేమించుకున్నామో? ఏం కొరకు ప్రేమించుకు న్నామో? అసలు తామిరువురం నిజంగానే ప్రేమిం చుకున్నామా? అంతా అగమ్యగోచరంగా వుంది జయమ్మకు.

తాను అందంగా వుంటానని మాత్రం నమ్మిక జయమ్మకు. ఆ విషయమూ తనకు తన చుట్టు ప్రక్కలవాళ్లు అనటం వలనే తెలిసింది. అయితే, తన అందానికి తగునైన కలలు మాత్రం కనలేదు జయమ్మ. జయమ్మ కలలకు మొదటి నుంచీ ఏవో అదృశ్య శక్తులు అడ్డుతగులుతూనే వుండేవి. నిజానికి అవేం అదృశ్య శక్తులు మాత్రం కాదు. వాటిని తేరిపారా చూసే శక్తి జయమ్మకు లేదంతే.

ఒక రోజు వున్నట్టుండి వెంకటయ్య నిన్ను నేను ప్రేమించానవటం. అందుకు జయమ్మ సిగ్గుపడటం. ఈ విషయం ఇంట్లో తెలవటం. 'ఏమే నీకు మేం పెళ్లి చేయలేమనుకున్నావా ఏమి? ప్రేమా గీమా అంటున్నావ్' అంటూ తన తండ్రీ, అన్నా ప్రశ్నిం చటం. నిజంగానే తనకు కట్నమిచ్చి వెంకటయ్య స్థాయి, అందం, కులం ద్వారా వచ్చిన సామాజిక గౌరవం వున్న వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లోనూ తేలేరని జయమ్మ మనస్ఫూర్తిగా నమ్మటం. నమ్మి వెంకట య్యతో ఓ అర్ధరాత్రి ఇల్లు వదలి, ఊరు వదలి, తమ పల్లెకు 29 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ చిన్నపాటి పట్నానికి వచ్చి కాపురం పెట్టడం.

ఇప్పటికి నాలుగేళ్లు గడిచింది. డిగ్రీ కూడా పూర్తికాని వెంకటయ్యకు బట్టలకొట్టులో గుమస్తా పని దొరకటమే గగనమైపోయింది. నెలకు వెయ్యి రూపాయిలు జీతం. నాలుగేళ్ల నుంచి సంసారాన్ని నెట్టుకొస్తూ వుంది. రెండేళ్ల క్రితం మొదటి బిడ్డ లక్ష్మి పుట్టింది. ఈ ఒక్క బిడ్డతో సరిపెట్టు కుందామంది జయమ్మ. వెంకటయ్య వొప్పుకోలేదు. వంశాంకురం కావాలన్నాడు. మగబిడ్డ కోసం కల లూగన్నాడు. మళ్లీ గర్భం దాల్చింది జయమ్మ. వెంకటయ్య పొంగిపోయాడు తనకు మగబిడ్డ పుడతాడని. జయమ్మను కంటికి రెప్పలా చూసుకు న్నాడు. అంతకు ముందు ఇంట్లో ఊరికే కూసుంటే ఏమొస్తుందని జయమ్మ రోజా పూలు కట్టి పది రూపాయిలదాకా సంపాదించి, ఇంటి ఖర్చులకు ఉపయోగించేది. గర్భందాల్చినప్పటి నుంచీ ఆ పనీ మానెయ్యమన్నాడు వెంకటయ్య. బిడ్డ బంగారంలా పుట్టాలని - భార్యను ఏ పనీ చేయనీయకుండా విశ్రాంతి తీసుకోనిచ్చాడు. జయమ్మ బిడ్డను కనింది. ఆడబిడ్డ. వెంకటయ్యలోని మగ మృగం బుసలు కొట్టడం ప్రారంభించింది. అప్పటి నుంచీ ప్రారంభమయ్యాయి జయమ్మకు కష్టాలు.

... ... ...




పెళ్లి లేందే ఆడబిడ్డకు బతుకు లేదు. కులం, కట్నం లేందే ఆడబిడ్డకు పెళ్లి కాదు. ఏ తల్లి దండ్రులైనా తమ ఆడబిడ్డకు కులాన్నీ, కట్నాన్నీ ఇవ్వలేనపుడు - ఆ బిడ్డకు బతుకును, భవిష్యత్‌నూ ఇవ్వలేనట్టే లెఖ్ఖ. కావున ఆ బిడ్డను వొదిలించు కోవటం మంచిది - ఇదీ వెంకటయ్య ఆలోచన. అవగాహన.

ముందరొక ఆడపిల్లుంది. ఆ బిడ్డను పెంచి, పెద్ద చేసి, పెళ్ళిచేసేందుకే తమ బతుకు సరిపో తుంది. ఇక ఈ రెండో బిడ్డను భరించటం అసాధ్యం. తన ఆదాయం ఇంతకు మించి పెరు గుతుందన్న ఆశ లేదు. తనవైపు వాళ్లుగానీ, తన భార్య వైపు వాళ్లుగానీ ఆదరించి, ఆదుకుంటారన్న నమ్మకం లేదు. జయమ్మ కట్టుబట్టల్తో ఇంట్లోంచి వచ్చిందేగాని, కాణీ కట్నం తేలేదు. పెళ్లయ్యి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ ఇరు వైపుల వాళ్లూ తన వైపు తిరిగయినా చూడలేదు. తమది కులాంతర వివాహమన్నా కాకుంటే - తన 'మేనరికం'లో ఎవరో ఒకరైనా తమ ఆడబిడ్డల్ని కాస్త కట్నం తక్కువైనా వొప్పుకుని పెళ్లి చేసుకుంటారన్న ఆశైనా వుండు. తాము కులం చెడిపోవడంతో ఇప్పుడు ఆ ఆశా లేదు. ఈ పరిస్థితుల్లో రెండో బిడ్డనూ వుంచుకోవటమంటే తెలిసి, తెలిసీ దాని బతుకునూ నాశనం చేసి, తామూ నాశనమైనట్టే లెఖ్ఖ. కాబట్టి, 'రెండో పిల్లను వొదిలించుకోవాలని' తాను తీసుకున్న నిర్ణయంలో ఏ మాత్రం తప్పులేదని, తన నిర్ణయానికి కట్టుబడిపోయాడు వెంకటయ్య.

... ... ...

'ఎవరికైనా ఇచ్చెయ్యి'

ఎక్కడో చోట వొదిలెయ్యి.

లేదా, గొంతు నులిమి చంపెయ్యి. - రోజూ తన మొగుడి మూర్ఖత్వం, మొండితనం, మాన వతా రాహిత్యం తనకు తెలుసు. ఎంత వేడుకున్నా, బతిమాడుకున్నా, - తననూ, బిడ్డనూ ఇద్దర్నీ ఇంట్లో వుండనిచ్చే ప్రసక్తే లేదు. బిడ్డను వొదులు కుని అయినా భర్తతో కాపురం చెయ్యాలి లేదా బిడ్డను తీసుకొని ఇల్లొదిలి వెళ్ళిపోవాలి. అలా వెళ్లి, తానొక్కతే ఈ సమాజంలో బతకగలదా? మగతోడు, ఆర్థిక అండా లేని ఆడదాన్ని ఈ సమాజం బతకనిస్తుందా? తాను ఒక వేళ బైటకు వెళ్లి బతికినా తన మొదటి బిడ్డను భర్త సరిగా చూసుకుంటాడా? తాను వెళ్ళిపోతే ఆ బిడ్డ పరిస్థితి ఏమిటి?.

'ఏదో ఒక జబ్బొచ్చి ఈ రెండో బిడ్డను తీసు కువెళిపోతే...!? - ఛీ ఏంటి తనిలా ఆలోచిస్తూ వుంది. ఏ తల్లయినా ఇలా ఆలోచిస్తుందా? చూస్తూ, చూస్తూ బిడ్డ చావును కోరుకుంటుందా? ఎందుకింత కిరాతకంగా తయారవుతూ వుంది తను? - కాకపోతే మార్గమేమిటి? ఏ జబ్బో వచ్చి తన బిడ్డ చనిపోతే - ఈ సమాజం తనను "బిడ్డను అమ్మేసిందని, లేదా చంపేసిందని" తన గెద్ద ముక్కుతో పొడవటం మానేస్తుంది. ఈ సమాజం దృష్టిలో తాను నేరస్తురాలు కాకుండా పోతుంది. తన భర్తకు భారం కాకుండా పోతుంది. తన సమస్య కొక పరిష్కారం దొరుకుతుంది. తన బతుకు కాస్త కుదుట పడుతుంది. సమాజం తనను క్షమిస్తుంది సరే - సమాజం తనను వేలెత్తి చూపకుండా వుంటుంది సరే - తనను తానెట్ట సమాధానపరుచుకోవాలి. తనను తానెట్ట ఓదార్చు కోవాలి. తనను తానెట్ట నిమ్మళపరచుకుని - తిరిగి మనిషిగా బతకగలగాలి. ఇంతటి నేరాన్ని, ఇంతటి ద్రోహాన్ని ఎలా జీర్ణించుకొని జీవించగలగాలి?

ఒకటే నస వెంకటయ్యది. ఇప్పుడు బిడ్డకు రెండు నెలలు నిండినాయి. రెండు నెలలు నిండిన పండంటి బిడ్డను 'ఎలా వొదిలించుకోవాలి' జయ మ్మది తుది లేని వేదన. తల్లి కడుపు ససేమిరా అంగీకరించట్లేదు.

బతిమాలుతున్నాడు వెంకటయ్య. బుజ్జగించాడు. భగ్గున మండాడు.

తిట్టాడు, కడకు కొట్టను కూడా కొట్టాడు జయమ్మను.

'అయితే నువ్వే ఏదో ఒకటి చేసెయ్' అంది జయమ్మ ఈ వేధింపులు భరించలేక.

మౌనం దాల్చాడు వెంకటయ్య. ఆ పాపం, పాతకం తనకు తగలకూడదు. ఆ పనేదో తన భార్యే, ఆమె చేతులతోనే చెయ్యాలి - మగ బుద్ధి. - ఏది ఏమైనా, పేగు తీసిన చేజేతులా తెంచుకోలేకపోతూ వుంది జయమ్మ. భర్తకు ఏం సమాధానమివ్వాలో, ఎలా నచ్చజెప్పాలో అర్థంకా కుండా వుంది జయమ్మకు. ప్రతి రోజూ ఉదయం ఉద్యోగానికి వెళ్ళేప్పుడు - 'నేను తిరిగొచ్చేలోపు అది నా కంటికి కనిపించకూడదు' షరతు విధిస్తాడు. రాత్రి ఇంటికొచ్చి, బిడ్డను చూసినప్పటి నుంచీ ఒకటే యుద్ధం. ఈ పిల్ల పుట్టినప్పటి నుంచీ కంటి మీద కునుకే కరువైంది జయమ్మకు.

ఏం చెయ్యాలో పాలుపోవట్లేదు. పక్కవాళ్లతో పంచుకునే సమస్య కూడా కాదిది. ఎవరికైనా తెలిస్తే, వింతగా చూస్తారు. విపరీతార్థాలు తీస్తారు. వెలివేస్తారు. కొన్ని సమస్యలను నలుగురితో పంచుకో వటం కన్నా - గుండెల్లోనే దాచుకోవటం ఉత్తమం. అట్లనీ, తాను ఒక్కతే దిగమింగుకోలేకపోతూ వుంది. రోజు రోజుకీ, ఆలోచించీ, ఆలోచించీ తన మెదడు బద్దలైపోయేట్టుంది.

ఎటువైపు నుంచి, ఎంతగా ఆలోచించినా తన బిడ్డను వేరొకళ్లకు ఇచ్చెయ్యటమే ఉత్తమమనిపిం చింది జయమ్మకు. ఎవర్ని అడగాలి? ఏమి అడగాలి? ఎలా అడగాలి? 'ఈ పసికందునెందుకు వొదిలించుకుంటున్నావంటే' - ఏమని సమాధానం చెప్పాలి? - అయినా తప్పదు.

ప్రయత్నాలు మొదలెట్టింది జయమ్మ.

తనకు బాగా పరిచయమున్న, తన వీధిలో పాలు పోసే పుల్లమ్మ అయితే ఈ విషయంలో తనకు సహాయం చేయగలదని భావించి, పుల్లమ్మ వద్ద ఈ విషయం కదిపింది.

"పుల్లమ్మక్కా, దీన్ని ఎవరికైనా ఇచ్చెయ్యాలను కుంటా వుండాను. ఎవరైనా తీసుకుంటారేమో అడిగి సూడు" చాప మీద పడుకొని బోసినవ్వులు చిందిస్తూ వున్న పసికందును చూపిస్తూ అనింది జయమ్మ.

ఆశ్చర్యపోయింది పుల్లమ్మ. "మీ కేం దూను తగిలిందే. పుత్తడిబొమ్మలాంటి బిడ్డను ఇంకొకళ్ళకు ఇచ్చేస్తారా...!" నోరెళ్లబెట్టి, శాపనార్థాలు పెట్టడం మొదలెట్టింది.

'ఆయన వొప్పుకోవట్లే...'

"మీ ఆయన వొప్పుకోవట్లేదా? ఏ మొచ్చిందోడికి. పుట్టిన బిడ్డని ఇంకొకళ్లకి ఇచ్చెయ్యమంటున్నాడా? వోడసలు మడిసేనా?" చెడామడా తిట్టసాగింది.

'ఎంత సెప్పినా ఇనటం లేదు పుల్లమ్మక్కా, బిడ్డని వొదిలించుకోకుంటే నన్నే వొదిలేస్తానంటా వుంటాడు'.

'ఏమే జయమ్మా! నీ మీదేమైనా అనుమానం వుందా మీ ఆయనకు'. చెంప చెళ్ళుమన్నట్టు తగిలింది ఆ మాట జయమ్మకు.

'ఏ మొగోడైనా ఇంత మంకుపట్టు పడతావున్నా డంటే - ఈ బిడ్డ తనకు పుట్టలేదన్న అనుమానం వుండుండాలి. లేదంటే ఇంత ఇతండంగా మాట్లా డరు' తనకు తెలిసిన తర్కాన్ని బైట పెట్టింది పుల్లమ్మ.

తను చేయని నేరానికి, ఆలూ-మగలూ ఇద్దరూ సమానంగా పంచుకోవాల్సిన బాధ్యతకి, ఆడదిగా పుట్టినందుకు తననే బాధ్యురాల్ని చేసి, కడకు తన శీలం మీదనే అభాండం వేస్తూ వుంటే, ప్రాణం కన్నా మిన్నగా శీలాన్ని కాపాడుకోకుంటే బతుకులే దని నమ్మే ఏ స్త్రీ అయినా పుల్లమ్మ ప్రశ్నకు ఏమని సమాధానం చెప్పగలదు?

భోరున ఏడుస్తున్న జయమ్మను చూసి, చివు క్కుమంది పుల్లమ్మ మనస్సు. తానూ ఆడదే కదా. 'ఆడజన్మ'ను జయమ్మకన్నా అధికంగా అనుభవిం చిన ఆడది కదా. ఆడజన్మ చేతిలో నిర్ణయాధికారం వుండదని, వేరొకళ్ల నిర్ణయాలకనుగుణంగా, అభిప్రా యాల కనుగుణంగా, నమ్మకాలకనుగుణంగా, విశ్వా సాలకనుగుణంగా, ఆనందానికనుగుణంగా ఆటబొ మ్మలా ఆడేదే ఆడజన్మని అనుభవపూర్వకంగా అర్థంచేసుకున్న 49 సంవత్సరాల నిండు ముత్తయి దువ కదా పుల్లమ్మ. ఇంక ఈ విషయం గురించి మాటలు పొడిగించడం భావ్యం కాదనుకుని "సరే లేయే జయమ్మా. ఎవర్నైనా అడుగుతాను" అంటూ చివుక్కున లేచి వెళ్ళిపోయింది.

చనిపోవాలనిపించింది జయమ్మకు. ఈ అను మానాల నుండి, అవమానాల నుండి, అసహాయత నుండి, ఆవేదన నుండి తన హృదయంలో తాను స్పందించలేని, తన జ్ఞానంతో తాను తర్కించలేని, తన అవగాహనతో తాను నిర్ణయం తీసుకోలేని, ఈ పరాధీన జీవితం నుండి, పడుతున్న కష్టాల నుండి దూరంగా ... దూరంగా జరిగిపోవాలనిపించింది జయమ్మకు.

చావు... ఊపిరి బిగబట్టుకుని బతుకుతున్న తన బతుక్కి, ఊపిరి బంధించుకుంటే దక్కే అమృతం. నిజంగానే చనిపోవాలనుకుంది జయమ్మ. తనతోటు తన ఇద్దరు ఆడబిడ్డల్నీ చంపుకునేసి, సంపూర్ణంగా చావులో తన సమస్యకు పరిష్కారం వెతుక్కోవాల నుకుంది జయమ్మ.

సమస్యకు పరిష్కారం ఒక్క చావులో తప్ప మరి దేంట్లోనూ వెతుక్కోలేకపోవటం కన్నా మించిన చావే ముంది మనిషికి. నిజానికి చావును జీవిస్తున్న వారే అధికం కదా మన సమాజంలో - బతుకుకు ప్రత్యామ్నాయం చావు. బాధకు ప్రత్యామ్నాయం చావు. సమస్యకు ప్రత్యామ్నాయం చావు. చావుకు ప్రత్యామ్నాయం చావు. అందుకే ఈ బతుకుల్లో ఇంత చావు కంపు. అందుకే ఈ సమాజంలో ఇంత చావు కంపు. అందుకే మన పరిష్కారాలలో, ప్రత్యామ్నాయాలలో ఇంత చావు. చావు బతు కుకు అనివార్యమై పోయి బతుకొక యాక్సిడెంటల్ అయిపోయింది.

... ... ... ...

తను ఆత్మహత్య చేసుకుని చనిపోతే దెయ్య మైపోతానేమో? తనైతే పరవాలేదు. తన ఇద్దరు బిడ్డలు కూడా దెయ్యాలైపోతే ఎలా? 'అది పోయేదే కాకుండా ఆ ఇద్దరు బిడ్డల్ని కూడా దెయ్యాల్ని చేసి పోయింది ముండ" అని అందరూ తనని ఆడిపోసుకుంటారు. బిడ్డల్ని వొదిలేసి తనొ క్కటే చనిపోతే...? 'పొయ్యేదేదో బిడ్డల్నీ తీసుకోని పోకుండా - తాను మాత్రం సుఖపడిపోయింది మహాతల్లి. బిడ్డల్ని ఈదులపాలు జేసేసి" అని శాపనార్థాలు పెడతారు. మాతృత్వం ఇంతగా తన బతుకుకు బంధనమైపోతుందని కలలో కూడా ఊహించలేదు జయమ్మ. ఇప్పుడు ఏ దిక్కుకు తిరిగినా 'మాతృత్వం' పెనుభూతమై అమాంతం మీద పడిపోతూ వుంది.

... ... ... ...

బతుకు మార్గాలన్నీ మూసుకుపోయాయని భావించి, చావుకొక దారి వెతుక్కుంటున్న జయ మ్మకు, ఈ దారీ అంత సులభంగా దొరికేది కాదని అర్థమవుతూ వుంది. పాపం, పాతకం, నీతీ, నియమం, ఫలం, పుణ్యం... వెంటబడి తరుముకురాని అచ్చమైన, స్వచ్ఛమైన చావు తనకు రాదుగాక రాదనీ, వేటి నుండైతే తాను బయటపడా లనుకుందో, వేటినైతే తాను జయించాలనుకుందో, వేటినైతే తాను అపహాస్యం చేసి, హాయిగా మరొక చోటుకు వెళ్ళిపోవాలనుకుందో - అలా వెళ్ళిపోవడం కుదరదని, ఆ 'చోటు' చావులో లేదుగాక లేదని ఒక నిర్ణయానికి వచ్చేసిన జయమ్మ, ఎలాగైనా బత కాలనుకుంది. బతికేయాలనుకుంది. ఎలాగోలాగు ఈ బతుకును లాగించేసి, ఈ బతుకు ఛాయలు, ఈ బతుకు ప్రతిఫలాలు లేని సహజమైన చావునే చావాలనుకుంది.

... ... ... ...

మరో నెల రోజులు గడిచాయి. పుల్లమ్మ వచ్చింది. "జయమ్మా ఎవరూ ముందుకు రావట్లేదమ్మే.. అప్పటికీ అయినోళ్లనీ, కానోళ్లనీ అందర్నీ అడిగినా నీ కోసం - ఒక్కరూ ఒప్పుకోలా. అంతా ఇని, ఆడబి డ్డని ఎవురు పెంచుకుంటారు?? మగబిడ్డయితే... అని నసగతావుండారు. ఇంక నా వల్ల కాదమ్మే, నువ్వే ఏదో ఒక దారి చూసుకో" అని ఖరాఖండిగా చెప్పేసింది.

అవును! ఎవరు మాత్రం ఎలా తీసుకుంటారు? ఎందుకు తీసుకుంటారు? తెలిసి, తెలిసీ మోయ లేని బరువు నెందుకు నెత్తికెత్తుకుంటారు? చూస్తూ చూస్తూ నిప్పుల కుంపటి నెందుకు గుండెల కానించు కుంటారు? పంచుకునే బాధ్యత కాదిది. దించుకునే బాధ కాదిది. భరిస్తూ పరిష్కారం వెతుక్కో వాలి. భరించడంలోనే పరిష్కారం కనుక్కోవాలి. ఇది బరువనుకున్నా, బాధ్యత అనుకున్నా, బంధం, అనుబంధం ... ఏ పేరెట్టి పిలుచుకున్నా - ఇందులోంచి పారిపోయేందుకు మాత్రం కుదరదు.

(మిగతా 13వ పేజీలో)





75



# మనసు వైద్యం

? మా మామగారి వయసు 43 సంవత్సరాలు. ఆయన ఎప్పుడూ క్షుద్ర పూజలు చేస్తుంటారు. ఆయన తమ్ముడు ఆయన మనస్సును వశపర్చుకుని ఆయన్ని ఆడిస్తున్నాడు. ఆయన తమ్ముడు కూడా క్షుద్రపూజలు చేస్తాడు. వాళ్ళ తమ్ముడు ఇతను ఇద్దరు మంత్రాలు అని తిరుగుతుంటారు. ఒక్కొక్కసారి మూగ సైగలు చేస్తూ కూర్చుంటారు. తపస్సు అంటారు, జుట్టు పెంచుతారు. వారిని బాగుచేయడానికి మార్గం చెప్పండి.

— బి. రంగనాథ్–తిరుపతి

! నిజానికి క్షుద్రపూజలంటూ ఏవీ లేవు. కేవలం ఇవన్నీ మూఢ నమ్మకాలే. కొన్ని రకాల మానసిక సమస్యలు వున్నవాళ్ళు ఈ విధంగా ప్రవర్తిస్తుంటారు. మీ మామగారికి, ఆయన తమ్ముడికి తగిన మానసిక చికిత్స ఇప్పిస్తే, వాళ్ళిద్దరూ బాగుపడతారు. వీలయితే ఒకసారి వాళ్ళిద్దరూ నన్ను కలిసేటట్లుగా చేయండి. వాళ్ళిద్దరికీ సాయపడటానికి ప్రయత్నం చేస్తాను. అనేక రకాల మూఢనమ్మకాలు వున్నవాళ్ళు కూడా ఇటువంటి మానసిక రోగాలకు లోనవుతారు. కాబట్టి మూఢనమ్మకాలు లేకుండా చేసుకుంటే అనేక రకాల మానసిక, శారీరక రుగ్మతలకు దూరంగా వుండవచ్చు.

? నేను మా ఇంటి పక్కన వున్న అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమించింది. కాని, ఈ మధ్య ఆ అమ్మాయి నాతో మాట్లాడటం లేదు. మాకు ఆస్తి లేదు. కనీసం ఇల్లు కూడా లేదు. ఆ అమ్మాయికి ఇల్లు వుంది, పొలం వుంది. నేను 9వ తరగతి చదువుతున్నాను. ఆ అమ్మాయి మాట్లాడాలంటే ఏమిచేయాలి?


–జి. రాజేంద్రప్రసాద్, దిల్‌సుఖ్‌నగర్

! సినిమాలు, టి.వి.లు తెగచూసి వాటి వ్యామోహంలో నుంచి తేరుకోకుండా పధ్నాలుగేళ్ళకే ప్రేమ అంటూ చదువుని నిర్లక్ష్యం చేయడం ఏ మాత్రం మంచిది కాదు. అసలు మీ వయసులో ప్రేమకి, కామానికి తేడా తెలియదు. ప్రపంచమంతా రంగులమయంగా కనబడుతుంది. తెలిసి తప్పులు చేసినా తెలియక తప్పులు చేసినా కొన్నిసార్లు జీవితంలో చాలా బాధపడవలసి వస్తోంది. అందుకని మీరు బాగా చదువుకొని జీవితంలో బాగా పైకి వచ్చాక ప్రేమ గురించి ఆలోచించడం మంచిది.

★ హిప్నటిజం నేర్చుకోవాలంటే ఏం చేయాలి

★ ఒంటరితనాన్ని హిప్నోథెరపీ నయం చేస్తుందా?

★ 9వ తరగతి చదువుతున్నాను పక్కింటి అమ్మాయిని ప్రేమించాను.



? నాది ఒక విచిత్రమైన సమస్య. ఒక సంవత్సరం క్రితం మా కాలనీలో ఒకతను హేర్ కటింగ్ సెలూన్ పెట్టాడు. ఆ రోజు నుండి డైలీ నన్ను చూస్తూంటాడు. నేను ఇప్పుడు ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాను. మా ఫ్రెండ్స్ అందరూ "ఒక సంవత్సరం నుండి చూస్తున్నాడు అంటే నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాడు" అని అంటున్నారు. కానీ నాకు ఏమీ అర్థంకావడం లేదు. అతను నన్ను చూసినప్పుడల్లా సైగలు, పాటలు పాడుతూ వుంటాడు. ఇంకా అందంగా వున్నావు. వెరీ స్మార్ట్ అంటాడు. నేను కొద్దిగా రంభలా వుంటాను. అతను నాతో ఎన్నోసార్లు కలవటానికి ప్రయత్నించినా నేను తప్పించుకున్నాను. నాతో ఎన్నోసార్లు మాట్లాడినాడు కానీ నేను మాట్లాడలేదు. నేను ఒకరోజు కన్పించకపోతే అతనికి ముఖం ఉబ్బి కోపంగా చూస్తూ వుంటాడు. అతడు కన్పించకపోతే నాకు ఏదోలా విచారంగా ఏదో పోగొట్టుకున్నాను అన్న ఫీలింగ్‌లో పోతాను. ఎగ్జామ్ జరుగుతున్నప్పుడు ఎగ్జామ్ బాగా వ్రాశావా అని సైగ చేసినాడు కాని నేను మౌనం వహించాను. అతడు నన్ను చూడడం వల్ల మా కాలనీవారు చులకనగా చూస్తున్నారు. దయచేసి నేను ఏమి చేయాలో చెప్పండి?

–జె.మౌనిక, షంషాబాద్

! మీరు వ్రాసిన ఉత్తరాన్ని బట్టి చూస్తే నాకు అర్థమైనది ఏమిటంటే మీరు కూడా అతనిని ప్రేమిస్తున్నారు. ఒక వేళ అతను కూడా మిమ్మల్ని ప్రేమిస్తున్నట్లయితే మీ పెద్దవాళ్ళను కలవమని అతనితో చెప్పండి. అంతా సవ్యంగా వుండి మీ వివాహం జరిగితే ఎవరైతే మిమ్మల్ని చులకనగా చూస్తున్నారో వాళ్ళ మిమ్మల్ని హీరోయిన్‌గా చూస్తారు. వయసంటూ వచ్చాక సెక్స్ కోరికలు రావడం చాలా సహజం, సెక్స్ కోరికలంటూ వచ్చాక ప్రేమకి, కామానికి తేడా తెలియదు. మీరు జాగ్రత్తగా ముందుకు అడుగువేయడం మంచిది.

? డాక్టరుగారూ! మైండ్ ఫ్రెష్‌గా వుండాలంటే ఏమిచేయాలి? హిప్నాటిజం ఎలా చేస్తారు? సెల్ఫ్ హిప్నాటిజం నేర్చుకోవాలంటే ఏమి చేయాలి? మా ఊరు చాలా దూరం, హైదరాబాదు రావాలంటే చాలా కష్టం. సెల్ఫ్ హిప్నాటిజం నేర్చుకోవడానికి ఇంకా ఏమైనా మార్గాలు వున్నాయా?

–ఒ. రామకృష్ణ, కేసరపల్లి

! ఎన్ని కష్టాలు వచ్చినా ఎంత టెన్షన్ వున్నా, మనసుని ప్రశాంతంగా వుంచుకోవడం వల్ల మైండ్ ఫ్రెష్‌గా వుంటుంది. పేషెంట్లకి సజెషన్స్ ఇవ్వడం ద్వారా హిప్నటైజ్ చేయడం జరుగుతుంది. సెల్ఫ్ హిప్నాటిజం మీరు పోస్ట్ ద్వారా కూడా నేర్చుకోవచ్చు. వివరణ మరియు అప్లికేషన్ పుస్తకం కొరకు దయచేసి మా అడ్రస్‌కు ఉత్తరం వ్రాయండి.

? నాది ఒక వింత మానసిక వ్యాధి. పదిమందిలో మరియు బయటివారితో మాట్లాడాలంటే సిగ్గు, భయం, వణుకు ఆటోమాటిక్‌గా పుట్టుకు వస్తుంది. ఇందువల్ల నాకు స్నేహితులు మరియు తెలిసినవారు ఎవరూ లేరు. పని మీద ఆసక్తి కూడా లేదు. ఏదో బాధాకరమైన ఆలోచనలు పెట్టుకొని బాధపడుతున్నాను. ఎప్పటికి ఒంటరిగా వుండి బాధపడతాను. మీ హిప్నోథెరపి ద్వారా ఈ వ్యాధి నయం చేయవచ్చా? దయచేసి తెలుపగలరు.

–ఎస్. సుధాకర్, వరంగల్

! మీలో చాలా ఆత్మన్యూనతా భావం వున్నది. మీకు చాలా అనవసరమైన భయాలు వున్నాయి. ముఖ్యంగా మీకు గ్రూప్ ఫోబియా ఎక్కువగా వుంది. గ్రూప్ ఫోబియా అంటే పదిమందిలో మాట్లాడలేకపోవడం. అంతేకాకుండా మీకు అనవసరమైన ఆలోచనలు కూడా ఎక్కువగా వున్నాయి. హిప్నోథెరపీ ద్వారా మీ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. మీకు వీలయితే పర్సనల్‌గా కలవండి.

–డా. వి. నగేష్

హిప్నటిస్ట్

208, సెకండ్ ఫ్లోర్, కరన్ సెంటర్, ఎస్.డి.రోడ్, పార్క్‌లేన్ చౌరాస్తా వద్ద, సికింద్రబాద్-500 003

మీ మానసిక సమస్యలు, సందేహాలు కింది చిరునామాకు రాయండి. డాక్టర్ నగేష్ వాటికి సమాధానం ఇస్తారు. మీ ప్రశ్నలు వివరంగా వుండాలి. కవర్‌మీద మనసువైద్యం అని రాయాలి.

చిరునామా

మనసువైద్యం
ఆదివారం ఆంధ్రజ్యోతి
రోడ్ నెం: 8, బంజారాహిల్స్,
హైదరాబాద్-500 034


# మీ కుటుంబ ఆరోగ్యానికి తులసి మొక్క పెంచండి





తులసి మొక్క గురించి తెలియని వారుండరు. చాలా ఇళ్ళలో ఇది పూజింపబడే పవిత్రమైన మొక్క. అయితే ఇలా పూజింపబడేది లక్ష్మి తులసి మాత్రమే. తులసిలో నాలుగు రకాలున్నాయి. లక్ష్మి తులసి, కృష్ణ తులసి, చినతులసి, భూతులసి.

తులసి మొక్కలు సాధారణంగా అన్ని ప్రాంతాల్లోనూ పెరుగుతాయి. మిగతా అన్ని తులసలలోకన్నా లక్ష్మి తులసిలో ఎక్కువ ఔషధ గుణాలుంటాయి. దీనిని ఆయుర్వేద పెన్సిలిన్‌గా పేర్కొంటారు. పరిశోధనల్లో తులసి మొక్క ఔషధంగా ఎంతో విలువైందని తేలింది. ఎన్నో రకాల వ్యాధుల్ని నిరోధించే శక్తి తులసికి వుంది. మలేరియా, చర్మవ్యాధులు, కీళ్ళవాతం, రక్తపుపోటు, లివర్ జబ్బులు, అనేక పిల్లల జబ్బులు తులసి ద్వారా నయమవుతాయని పలువురు వైద్య ప్రముఖులు తెలియజేస్తున్నారు. గుండె జబ్బులు, కేన్సర్, మూత్రపిండ వ్యాధులు, ఉబ్బసం, పొండు రోగం వంటి మొండి జబ్బులకు కూడా తులసి ఉపయోగపడుతుంది. వైరస్, ఇన్ఫెక్షన్, అలసట మొదలైనవాటి నివారణలో కూడా తులసి మొక్కలో అమోఘమైన శక్తి కలదని తేలినట్లు ఆయుర్వేద పరిశోధక మండలి తెలియజేసింది.



తులసి ఆకులు కండ్లకు అద్దుకొనుట వల్ల కొన్ని రకాల కంటి వ్యాధులు దూరంగా వుంటాయి. కండ్ల కలక, ఎరుపులు, పుసులు కట్టుట, నిదురలేక పోవుట, తల తిరుగుట, శరీరము ఊగుట మొదలగు ఎన్నో రోగాల మీద బాగా పని చేస్తున్నది. తులసి ఆకు రసం సన్నిపాత జ్వరములు త్రిదోష జ్వరముల మీద ఉపయోగించిన అద్భుతంగా పని చేస్తుంది. అంతేకాక కఫ జ్వరముల మీద కూడా అమోఘంగా పని చేస్తుంది. జ్వరము, దగ్గు, పైత్యశ్లేష్మ జ్వరము, కంఠమనందు శ్లేష్మము వుండి దగ్గు మాటి మాటికి వస్తున్నప్పుడు ఈ ఆకు చూర్ణం, పంచదార కలిపి వాడాలి.

ముక్కు నుండి నీరు కారడం, గొంతు బొంగురు పోవడం, తలపోటుతో జ్వరం, వాంతులు, ఆకుపచ్చని విరేచనాలు, నులి పురుగులు మొదలగు వాటికి దీని పసరు అద్భుతంగా పని చేస్తుంది. నోటిపూతకు పుక్కిలించిన తగ్గిపోతుంది. అంతేకాక విష దోషాలను కూడా కడుపులోకి తీసుకుంటే ఇది హరిస్తుంది. వాడలిన తులసి ఆకు ఆముదముతో నూరి చంటిపిల్లల తలలో కురుపులకు రాస్తే తగ్గిపోతాయి.

గొలుసు కట్టుగా పొగత్రాగటం (చైన్ స్మోకర్) తీవ్ర రక్తపోటుకు గురి కావటం వల్ల అలసట చెంది ఆయాసపడుతున్న ఒక పెద్ద ఆఫీసర్ తులసి రసం, మరికొన్ని ఓషధుల రసం నువ్వుల నూనెలో మరగబెట్టి ఆ తైలం సేవించడం మొదలు పెట్టాడు. క్రమంగా తీవ్రమైన రక్తపుపోటు నుంచి కార్డియో వాస్క్యులర్ బాధ నుంచి క్రమేణా స్వస్థత పొందటంతో పాటు ఆ తులసి నూనెను క్రమబద్ధంగా వాడటం ద్వారా అతడు ఆరోగ్యంగా, ఉత్సాహంగా మారాడని ఒక ఆయుర్వేద వైద్య నివేదికలో పేర్కొన్నారు.

మన పెరట్లో తులసిని పెంచటం వల్ల మనకు తెలియకుండానే ఇది మనకు చాలా ఉపకారం చేస్తుంది. ఈ మొక్క మీదుగా వచ్చే గాలి మన శరీరానికి తగిలి రోగాలు వ్యాపించనీయకుండా కాపాడుతుంది. మీ పెరటిలో తులసి మొక్క లేకపోతే వెంటనే నాటండి. మీకు స్థలం లేకపోతే చిన్న కుండీలో అయినా పెంచుకోండి.

— కె.ఆర్యేయం

**బోసినవ్వు కథ** (12వ పేజీ తరువాయి.)

అప్పులు – తానెందుకు పారిపోవాలి. పారిపోయేందుకు మార్గమే లేనప్పుడు – ఎంత వెతికినా దొరకనప్పుడు – పరిష్కారమేదో పారిపోకపోవడంలోనే వుండి వుంటుంది. అవును. ఎదురు నిలబడటంలోనే, నిలబడి ఢీకొనటంలోనే పరిష్కారం ఖచ్చితంగా ... ఖచ్చితంగా... ఖచ్చితంగా వుండి వుంటుంది. ఆ పరిష్కారం ఏమిటో ఇప్పుడు తనకు తెలియకపోవచ్చు. పరిష్కారం కోసం ఏం చేయాలో, ఎలా చెయ్యాలో కూడా తనకు ఒక అవగాహన లేకుండా పోయివుండవచ్చు. కానీ గాయంలోనే అంతర్లీనమై మానే గుణం కూడా వుంటుంది. కన్నీటిని చిట్లగొట్టగలిగితే చిరునవ్వు తప్పనిసరిగా సాక్షాత్కరిస్తుంది. సమస్యలోనే పరిష్కారముంటుంది. మాతృత్వం తనకు కలిగించిన సమస్యకు, మాతృత్వంలో – కుటుంబం తనకు కలిగించిన సమస్యకు కుటుంబంలో, సమాజం తనకు కలిగించిన సమస్యకు సమాజంలో – ఎక్కడ సమస్య వుంటుందో అక్కడే పరిష్కారమూ వుంటుంది తప్ప – పారిపోవటంలో మాత్రం పరిష్కారం కనిపించదు. తన ఇరవై మూడు సంవత్సరాల జీవితాన్ని వెమరువేసుకున్న తర్వాత...

వెమరు వేసుకోగా, వెమరు వేసుకోగా మెదడులో ఊరిన సారాన్ని దిగమింగుకోగా... జీర్ణించుకోగా జయమ్మకు 'పారిపోవటంలో పరిష్కారం వుండదన్న సత్యం' తన బిడ్డ బోసినవ్వంత స్వచ్ఛంగా కనిపించింది. బిడ్డ బోసినవ్వుల పెదాల్ని, తన పెదాలతో తాకింది జయమ్మ. అప్పటి వరకూ తనను మెలికలు తిప్పేస్తున్న ఆకలికి ఒక పరిష్కారం దొరికినట్టు తల్లి రొమ్మును గబుక్కున నోట కరిపించుకువేసింది పసికందు. ■

**వచ్చేవారం కథ**

**చిట్టచివరి రేడియో నాటకము**

**-డాక్టర్ వి.చంద్రశేఖర్ రావు**